https://epaper.eenadu.net

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

వసతిగృహాల రూపురేఖలు మారుస్తాం

పాఠశాలలో వసతులు పరిశీలిస్తున్న కలెక్టర్ సాయికాంత్‌వర్మ

తాడికొండ, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాలలు.. విద్యార్థుల మానసిక వికాసానికి తొలి మెట్టు కావాలని కలెక్టర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. తాడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలలో తరగతి గదులు, భోజనశాల, తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థ, క్రీడా మైదానాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వసతిగృహాల రూపురేఖలు మార్పు చేసేందుకు సంకల్పించామన్నారు. ఇందులో భాగంగా మొదటి దశలో 36 వసతిగృహాలు, గురుకులాలను తీసుకోవడం జరిగిందని చెప్పారు. పాఠశాల ఆవరణ, భవనాలు చూడముచ్చటగా ఉండేలా తీర్చిదిద్దాలని తెలిపారు. ప్రాంగణంలో మొక్కలు నాటి గురుకులం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి విద్యార్థులకు రక్షణ కల్పించాలని అన్నారు. జిల్లా గిరిజన సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి డి. దుర్గాబాయి, తహసీల్దార్ సీతారామయ్య, విద్యాధికారి ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే.. డ్రైడే కార్యక్రమాలను వార్డు స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంగళగిరి-తాడేపల్లి నగరపాలక కమిషనర్ అలీంబాషా సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణ, దోమల నియంత్రణ చర్యలపై శానిటేషన్ సెక్రటరీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యాధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయనం మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, జిల్లా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ అధికారి సుజాత, మున్సిపల్ హెల్త్ అధికారి మల్లిక, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ అలీంబాషా

భవిష్యత్తులో శక్తిమంతమైన సహాయక వ్యవస్థగా ఏఐ

మాట్లాడుతున్న ప్రొ.రామ్మోహన్

గుంటూరురూరల్, న్యూస్‌టుడే: భవిష్యత్తు మానవ నిర్ణయాలను మరింత సమర్థంగా, విశ్వసనీయంగా తీర్చిదిద్దే శక్తిమంతమైన సహాయక వ్యవస్థగా ఏఐ రూపుదిద్దుకోనుందని దక్షిణ కొరియాలోని కుంగ్‌పూక్ నేషనల్ యూనివర్సిటీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగ ప్రొఫెసర్, కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ మల్లిపెద్ది రామ్మోహన్ అన్నారు. ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో 'కౌంటర్ ఫ్యాక్చువల్స్ అండ్ ఎక్స్‌ప్లెయినబుల్ ఏఐ' అనే అంశంపై గురువారం నిర్వహించిన అంతర్జాతీయస్థాయి సాంకేతిక సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వీయ నిర్ణయాల్లో ఎక్స్‌ప్లెయినబుల్, కౌంటర్ ప్యాక్చువల్స్ సాంకేతికతల పాత్ర, పరిశ్రమల్లో ఏఐ వినియోగం, వైద్య, ఆర్థిక, రవాణా, విద్య తదితర రంగాల్లో ఏఐ ప్రాధాన్యం గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటేనే విద్యార్థులకు అత్యుత్తమ కెరీర్ అవకాశాలు లభిస్తాయన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ ముఖ్య అతిథిగా వచ్చిన ప్రొ. రామ్మోహన్ తమ కళాశాల పూర్వ విద్యార్థి కావటం గర్వకారణమన్నారు. కోశాధికారి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాదు, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు బస్సుల నిర్వహణ ఆర్టీసీకే అప్పజెప్పాలి

ఆర్టీసీ డిపో ఎదుట నాయకుల నిరసన

మంగళగిరి టౌన్: విద్యుత్తు బస్సుల నిర్వహణ బాధ్యతను ఆర్టీసీ ఆధ్వర్యంలో కొనసాగించాలని, ప్రైవేటుకు వద్దని ఏపీఎస్ఆర్టీసీ గుంటూరు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు అన్నవరపు ప్రభాకర్ అన్నారు. మంగళగిరి ఆర్టీసీ డిపో ఎదుట నాయకులు గురువారం నిరసన తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షుడు సాంబశివరావు, ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి వి. నాగేశ్వరరావు, ఏపీటీయూసీ నాయకులు గుర్రంకొండ సత్యానందం, బాపనపల్లి వెంకటేశ్వరరావు, నరేంద్ర, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

సీడ్‌యాక్సెస్ రహదారంటే హడల్!

ప్రాణాలు బలిగొంటున్న మితిమీరిన వేగం

ప్రమాదాల నివారణ చర్యలు శూన్యం

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్ (పాత చిత్రం)

తుళ్లూరు, న్యూస్‌టుడే

రాజధాని సీడ్‌యాక్సెస్ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాలమైన రహదారుల్లో వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణించటం ఈ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికుల ప్రాణాలు క్షణాల్లో గాలిలో కలుస్తున్నాయి.

☛ అదే రోజు తాళ్లాయపాలెంకు చెందిన దంపతులు పిల్లలతో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని మరో వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలయ్యారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ☛ ఈ నెల 23వ తేదీన రాయపూడి వద్ద టిప్పరు ఢీకొట్టడంతో వడ్డమాను గ్రామానికి చెందిన మహిళ అక్కడికక్కడే మృతి చెందారు.

☛ ఇటీవల రాజధాని నిర్మాణ పనులు చేపట్టిన ఎల్‌అండ్‌టీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న విజయనగరం జిల్లాకు చెందిన శ్రీహర్ష(30) అనే యువకుడు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని సీడ్‌యాక్సెస్ రహదారిపై నిర్లక్ష్యంగా వేగంగా వస్తున్న టిప్పరు ఢీకొట్టింది. దీంతో టిప్పరు ముందు భాగంలో ఉన్న ఓ చక్రం యువకుడి తలపైకి ఎక్కడంతో అతడు మృతి చెందాడు. ఈ ద్విచక్ర వాహనం నడుపుతున్న మచిలీపట్నంకు చెందిన షేక్ మన్సూర్(32)కు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి.

సిబ్బందిని పెంచుతాం

సీడ్‌యాక్సెస్ రహదారిపై ట్రాఫిక్ బాగా పెరిగింది. ఈ-3 రోడ్డును త్వరితగతిన పూర్తి చేసి ట్రాఫిక్ సిగ్నల్స్ తదితర సదుపాయాలు కల్పిస్తే ప్రమాదాలు తగ్గుతాయి. రహదారిపై ప్రమాదాలు జరగకుండా సిబ్బందిని పెంచుతాం. మితిమీరిన వేగంతో వాహనాలు ప్రయాణించకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తాం.

- బి.కోటేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ, తుళ్లూరు

స్పందించని సీఆర్డీఏ, ఏడీసీ విభాగాలు

సీడ్‌యాక్సెస్ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా.. పలువురు మృత్యువాత పడుతున్నా ప్రమాదాల నివారణకు సీఆర్డీఏ, ఏడీసీ విభాగాలు సరైన చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నాయి. రహదారిపై ఎవరు ఎటువైపు వెళుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. రోడ్లపై డివైడింగ్ మార్కులు, స్పీడ్ బ్రేకర్లు లేవు. సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయలేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించటం లేదు. గతంలో అనేకసార్లు సీడ్‌యాక్సెస్ రహదారిపై గేదెలు ఢీకొని వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. రహదారి అసంపూర్తిగా ఉండటంతో గ్రామాల్లో నుంచి అకస్మాత్తుగా వాహనదారులు రోడ్లపైకి వస్తున్నారు. రహదారులపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్నా పట్టించుకొనేవారు లేరు. రాజధాని ప్రాంతంలో తగినంతమంది ట్రాఫిక్ సిబ్బంది లేకపోవటం వల్ల ప్రమదాలు నివారించలేక పోతున్నారని స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

అమ్మవార్లకు ఆషాఢ సారె

పెదకొండూరు (దుగ్గిరాల): పెదకొండూరులోని కనకపుట్టలమ్మకు భక్తులు గురువారం ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ పాలకవర్గం ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడులో రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం వీర్లంకమ్మ, పోలేరమ్మవార్లకు ఆషాఢ సారెను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి భక్తులు సమర్పించారు.

వర్షం కోసం పూజలు

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు పండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహుని ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు పారాయణ, జపాలు నిర్వహించారు.

యోగా పోటీలకు విద్యార్థిని ఎంపిక

తాడేపల్లి: అమరావతి ఛాంపియన్‌షిప్-2026నకు తాడేపల్లి మండలం చిర్రావూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని శశిరేఖ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు అరుణశ్రీ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో అండర్-17 యోగా ఇంటర్నేషనల్ విభాగంలో జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

శివాలయ పాలకవర్గ ఛైర్మన్‌గా రవియాదవ్

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక గంగాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానం పాలక మండలిని నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 1983 నుంచి తెదేపాలోనే ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్యకర్త పసుపులేటి రవిని ఛైర్మన్‌గా నియమించారు. ఆయనతో పాటు కాకాని శ్రీనివాసరావు, రాపూరి చిట్టెమ్మ, వాకా సరోజిని, కోలవెన్ను రాంబాబు, తాడిబోయిన అరుణకుమారి, పొట్టూరి కృష్ణకుమారి, చయనం అనూరాధ, నల్లపాటి శ్రీనులను సభ్యులుగా నియమించారు. ఆలయ అర్చకులు నాగేశ్వరం యుగంధర ఎక్స్ అఫీషియో సభ్యులుగా కమిటీలో ఉంటారు. ఈ నెల 29న ప్రమాణస్వీకారం చేయనున్నట్లు రవి గురువారం తెలిపారు. మంత్రి నారా లోకేశ్‌కు, పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు విలువలతో కూడిన నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని గుంటూరు రైల్వే సీనియర్ డివిజనల్ అధికారి క్యాప్రిల్ అరోరా అన్నారు. మంగళగిరి అరవింద మోడల్ స్కూల్‌లో విద్యార్థి నాయకుల బాధ్యతల స్వీకారోత్సవం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా అరోరా హాజరై విద్యార్థి నాయకులతో ప్రమాణం చేయించారు. అనంతరం భారతీయ రైల్వే ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

కార్యక్రమంలో అగస్టీన్, శైలజ తదితరులు

కొమ్మూరు (కాకుమాను), న్యూస్‌టుడే: కొమ్మూరులో ఎన్నో ఏళ్లుగా తెదేపా కార్యకర్తలు ఎదురు చూస్తున్న ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు ముహూర్తం కుదిరింది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ నక్కల అగస్టీన్ తన స్వగ్రామంలో రూ. లక్షలు సొంత డబ్బులతో బస్టాండ్ నిర్మాణం చేపట్టి.. దానిపై ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. గురువారం ఆయన కార్యకర్తలు, మహిళలతో కలిసి భూమిపూజ చేశారు. జిల్లా తెదేపా అధికార ప్రతినిధి శైలజ, నాయకులు శ్రీనివాసరావు, బషీరు, అబ్దుల్ నబీ, ఖాదర్ మస్తాన్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాత పుస్తకాల వితరణ

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి క్రిస్టియన్‌పేటలోని ఎంపీపీఎస్ (ఎల్ఈ) పాఠశాల విద్యార్థులకు జూనియర్ సివిల్ జడ్జి లోకం సాయిశ్వేత, ఆమె తండ్రి న్యాయవాది జనార్దన్‌రావు సంయుక్తంగా గురువారం రాత పుస్తకాలు అందజేశారు. విద్యాశాఖాధికారి శాంతకుమారి, ఎంఈవో-2 నాగేశ్వరరావు సంయుక్తంగా పుస్తకాలు పంపిణీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి సాయిశ్వేతను అభినందించి సత్కరించారు. తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ యేసమ్మ, ప్రధానోపాధ్యాయులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నేతన్న సేవకు' మంత్రివర్గ ఆమోదం హర్షణీయం

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే: అర్హతున్న ప్రతి చేనేత కుటుంబానికి ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం అందించే నేతన్న సేవ పథకానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం హర్షణీయమని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు గుత్తికొండ ధనుంజయరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని, చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వృత్తి పరిరక్షణకు ఈ పథకం కీలకంగా నిలుస్తుందన్నారు. ఇటువంటి నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, సవితకు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విద్య.. వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరి ఆటోనగర్‌లోని రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల పనుల పురోగతిని తెలుసుకున్నారు. నాణ్యత తదితర అంశాల్లో ఎదురవుతున్న సమస్యలను అధికారులు ఛైర్మన్ శ్రీనివాసరావుతో చర్చించారు. నిర్ధారించిన లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని శ్రీనివాసరావు సూచించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పర్యవేక్షించాలని కోరారు.

విరాళం అందజేత

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అభివృద్ధికి దాసరి సత్యనారాయణ (పెదనందిపాడు) గురువారం రూ.25 వేలను ఓ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వీరరాఘవయ్యకు అందజేశారు. ఆయనకు పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపారు.

చెరువు పరిశీలన

అధికారులకు సూచనలిస్తున్న డ్వామా పీడీ శంకర్

దుగ్గిరాల, న్యూస్‌టుడే: డ్వామా పీడీ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి శంకర్ గురువారం కంఠంరాజుకొండూరు, పెనుమూలిలో పర్యటించారు. సామాజిక నీటి వనరుల అభివృద్ధి కింద ఎంపికై పనులు జరుగుతున్న పెనుమూలి చెరువును పరిశీలించారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి నరసింహారెడ్డితో కలిసి కంఠంరాజుకొండూరులో అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, వైద్య ఉపకేంద్రం, స్వర్ణ గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఎంఈవో కాజ శ్రీనివాసరావుతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు.

ప్రాంగణ ఎంపికల్లో 118 మందికి ఉద్యోగాలు

విద్యార్థులతో వెంకటేశ్వరరావు, అప్పారావు తదితరులు

పుల్లడిగుంట(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 118 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు జెట్టి అప్పారావు తెలిపారు. ప్రముఖ ఐటీ నియామక సంస్థ సావంటిస్ (హెచ్‌సీఎల్ హైరింగ్) 2026- 27 బ్యాచ్‌కు చెందిన 4వ ఏడాది చదువుతున్న విద్యార్థులకు ఎంపికలు జరిగాయి. అర్హత పరీక్ష, సాంకేతికమైన పలు అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.3.50 లక్షల నుంచి రూ.4.50 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కళాశాల ఛైర్మన్ పెరుమాళ్లు, డైరెక్టర్ డా. కె.వెంకటేశ్వరరావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డా. కె.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పంట బీమా తప్పనిసరి

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ప్రత్తి పంట బీమా నమోదు గడువు ఈ నెల 24తో ముగియనున్నందున అర్హులైన రైతులందరూ శుక్రవారం తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి సూచించారు. వెంగళాయపాలెం మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. వాతావరణ ఆధారిత ప్రత్తి పంట బీమా కార్యక్రమం క్షేత్రస్థాయిలో జరగుతున్న తీరును గురువారం జిల్లా అధికారి సమీక్షించారు. బుడంపాడు, ఏటుకూరులు ఏపీజీబీ బ్యాంకు మేనేజర్లతో సమావేశమై రుణగ్రహీత రైతుల ప్రత్తిపంట బీమా నమోదుపై చర్చించారు.

వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించాలి

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించుకోవాలని దిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ సంస్థ (ఐఏఆర్ఐ) డైరెక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు సూచించారు. వట్టిచెరుకూరులో చెరుకుమల్లి వారి దేవర శ్రీరేణుకా గంగమ్మ తల్లి, వీరుల ఆలయాన్ని గురువారం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. గ్రామ పెద్దలు, రైతులతో సమావేశమై వ్యవసాయంలో వస్తున్న మార్పులను వివరించారు. శ్రీనివాసరావును సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని గ్రామపెద్దలు అందించారు.

కొనసాగుతున్న దస్తావేజు లేఖరుల నిరసన

మంగళగిరి గ్రామీణం: జీవో నంబరు 396ను రద్దు చేయాలి డిమాండ్ చేస్తూ మంగళగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖరులు చేపట్టిన నిరసన గురువారం కొనసాగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, రాజధాని డివిజన్ అధ్యక్షుడు రవి పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మంగళగిరి దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివయ్య, కృష్ణ, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 7న చలపతిలో 'ఉద్గమ-2026'

తాడికొండ, న్యూస్‌టుడే: మోతడక చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆగస్టు 7న ఉద్గమ-2026 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కొల్లా నాగశ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఐతఈతఈ వంటి అంతర్జాతీయ వృత్తిపర సంస్థల కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఐతఈతఈ స్పోక్ బాలమురళీ కృష్ణ మాట్లాడుతూ ఇన్నోవేషన్, ఇంపాక్ట్, ఇన్‌స్పైర్ అనే థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల ఐతఈతఈ విద్యార్థి సభ్యులను ఒకే వేదికపైకి తీసుకువస్తామని వివరించారు. అనంతరం ఉద్గమ-2026 గోడ పత్రికలు ఆవిష్కరించారు.

కేంద్ర విద్యా మంత్రి రాజీనామాకు డిమాండ్

ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: దేశంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టినందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు గురువారం మంగళగిరిలో ర్యాలీ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కంతేటి జీవన్‌సాగర్ మాట్లాడుతూ దిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జిని ఖండించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును నిరసించారు. జీవన్‌సాగర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కంతేటి యలమంద, దామర్ల వీర ప్రసాద్, వింజమూరి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ చౌదరికి నివాళి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి తేళ్ల కృష్ణమ్మ చౌదరి జయంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి ప్రిన్సిపల్ వీరరాఘవయ్య, పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుడు సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప ప్రిన్సిపల్ ప్రతాప్‌కుమార్, ఎన్‌సీసీ కెప్టెన్ శ్రీనివాస్, కళాశాల కార్యాలయ ఇన్‌ఛార్జి పర్యవేక్షకుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించరా?

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పాలపర్రు ఎస్సీ కాలనీలో చివరి ప్రాంతవాసులకు నీరు సరఫరా కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని సీఐటీయూ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా గురువారం కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాలపర్రు, రాజుపాలెం, నాగులపాడు, వరగానిలో పర్యటించారు. ఆయా గ్రామాలలో కాల్వ పూడిక తీయించాలని కోరారు. పాలపర్రు కాలనీ చివరలో కోళ్ల ఫారం వల్ల దుర్వాసన వస్తోందని స్థానికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాగులపాడు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో పందులు తిరుగుతున్నాయని గోడ నిర్మించాలన్నారు. వరగాని ఎస్సీ కాలనీలోని శ్మశాన వాటికలో స్థలం చాలడం లేదని, అదనంగా మరో ఎకరం కేటాయించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు ఇవ్వాలన్నారు.

కాశీకి పాదయాత్ర చేస్తున్న తమిళనాడు వాసి

కృష్ణన్

ఫిరంగిపురం, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం విల్లుపురం మండలం గెంజి గ్రామానికి చెందిన కృష్ణన్(46) తన గ్రామం నుంచి కాశీకి పాదయాత్ర చేపట్టారు. తన గ్రామం నుంచి జూన్ 19వ తేదీన బయలుదేరిన అతడు. . చిత్తూరు, కడప, నంద్యాల, మార్కాపురం, వినుకొండ మీదుగా బుధవారం సాయంత్రానికి ఫిరంగిపురం మండలం వేమవరం కోటి లింగాల దేవస్థానాన్ని దర్శించుకున్ని రాత్రికి ఫిరంగిపురంలో బస చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణించాల్సిన దూరం సుమారు 2000 కి.మీ. ఉంటుందని, రోజుకి 20 నుంచి 25 కి.మీ ప్రయాణం చేస్తూ ఇప్పటికి 560 కి.మీ పూర్తి చేశానని తెలిపారు. ఇంకా తన ప్రయాణం మంగళగిరి, విజయవాడ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, బిహార్ మీదుగా సాగి కాశీ చేరుకోనున్నట్టు తెలిపారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ అందజేత

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని భీమినేనివారిపాలెంలో సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారులకు గురువారం బోనస్ పంపిణీ చేశారు. ఆ సంస్థ రెంటపాళ్ల యూనిట్ మేనేజర్ గోపి మాట్లాడుతూ 40 మందికి మొత్తం రూ.2.67 లక్షలు బోనస్ అందించామన్నారు. సంఘం అధ్యక్షులు గంగా శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ నవీన్ తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు కలకోటి సుబ్బారావు గారి కుమారుడు సురేష్, నెం. 5-631, బాట్లస్టేపేట, మంగళగిరి, గుంటూరు జిల్లా వారి సంజాయిషీ పొందియావన్నందికి ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా: నా క్లయింటు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని లింగినేని ప్రసాద్ గారి భార్య చంద్రిక మరియు లింగినేని రఘుబాబు గారి భార్య కోటేశ్వరమ్మ గార్ల నుండి కొనుగోలు చేయుటకు విక్రయ ఒప్పందము చేసుకొనియున్నారు. సదరు చంద్రిక మరియు కోటేశ్వరమ్మ గార్లకు షెడ్యూలు దాఖలా ఆస్తి సెటిల్మెంట్ ద.నెంలు.4641/2017, 4642/2017 తేది. 30-06-2017 యస్.ఆర్.ఒ.మంగళగిరి ద్వారా రిజిస్టర్ పొందియున్నారు. సదరు ఆ